నగరపాలక బడ్జెట్ రూ.285.74 కోట్లు

- ఆమోదించిన పాలకవర్గం
- సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి, సమస్యలపై చర్చించిన సభ్యులు
- టీడీపీ కార్పొరేటర్ల తీరుపై మేయర్ ఆగ్రహం
- ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని




ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య, సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు కాటసాని, సుధాకర్, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఏడాది బడ్జెట్ రూ.285.74 కోట్లుగా పాలక వర్గం ఖరారు చేసి ఆమోదం తెలిపింది. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక సంస్థ ప్రత్యేక బడ్జెట్ సమావేశం జరిగింది. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు. ఏడాదిలో నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయాలు, వ్యయాలపై సమావేశంలో చర్చించారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు. అదే సమయంలో టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పోడియం వద్దకెళ్లి దోమల సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తూ మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. మీడియా అటెన్షన్ కోసం నాటకాలు ఆడొద్దని, మేము చిత్తశుద్ధితో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ చెప్పారు. హంద్రీ, తుంగభద్ర నదుల్లో 20 ట్రాక్టర్లతో గుర్రపుడెక్క తొలగిస్తున్నామన్నారు. మీలా ప్రచారం కోసం పనిచేసే ప్రభుత్వం తమది కాదని టీడీపీ కార్పొరేటర్లకు మేయర్ చురకలటించారు. ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలు, ఫాగింగ్ చేపడుతున్నామని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించండి

కోడుమూరు అర్బన్ పరిధిలోని సంతోష్‌నగర్, గీతాముఖర్జీ నగర్, మమతానగర్, సమతానగర్, స్టాంటన్ పురం, కాలనీల ప్రజలు ప్రతి ఏడాది మురుగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. టన్నెల్ ఏర్పాటు ద్వారా సమస్య పరిష్కారమవుతుందని, ఆదిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానం ఇచ్చారు.

– కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలి

నగర పరిధిలో ఇటీవల పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయి. అక్రమార్కులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోండి. ఇందుకు నా వంతు సహకారం అందిస్తా. అలాగే పాణ్యం అర్బన్ పరిధిలో వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. అలాగే చికెన్ వేస్టేజీ సేకరణతో తాము నష్టపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారని, వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. నగరంలో దోమల నివారణ చర్యలు కూడా ముమ్మరం చేయాలని కోరారు.

– పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కార్పొరేటర్లు ఏం మాట్లాడారంటే.....

- విష్ణు టౌన్ షిప్ వద్ద రహదారులను, ర్యాంపులను ఆక్రమించి ఆక్రమణలు చేపడుతున్నారని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు
- పారిశుద్ధ్యం మెరుగుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ షేక్ యూనుస్ బాషా కోరారు.
- తమ వార్డు అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని కార్పొరేటర్ నారాయణరెడ్డి, సాంబశివరావు వెల్లడించారు.
- తమ వార్డులో ఆక్రమణలను తొలగించాలని కార్పొరేటర్ శ్రీనివాసరావు తెలిపారు.

పలు తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం

నగరపాలక సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో నగరపాలక పారిశుద్ధ్యం మెరుగుకు అదనంగా నియమించిన 671 కంటింజెంటి వర్కర్లకు రూ.54 లక్షలు వేతనాలు చెల్లించేందుకు అంగీకరించారు.

- తాగునీరు దుర్వినియోగం కాకుండా నియంత్రించేందుకు ఈఎల్ఎస్ఆర్‌ల వద్ద ఎలక్ట్రో మాగ్నటిక్ ఫ్లో మీటర్లు ఏర్పాటుకు రూ.99 లక్షలు కేటాయించారు.
- ఎండాకాలంలో నగర పరిధిలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రూ.1.80 కోట్లు వెచ్చించి నగరంలో బోరు వెల్స్ ఏర్పాటు, రిపేరు, రవాణా ద్వారా తాగునీటి సరఫరా తదితర పనులకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు.
- కొండారెడ్డి బురుజు వద్ద సౌండ్ అండ్ లేజర్ లైట్‌షోను శాశ్వతంగా అందించేందుకు అవసరమైన రూ.1.99 కోట్లు ఖర్చుకు ఆమోదం వ్యక్తం చేశారు.

అక్రమ లేఔట్లపై కమిషనర్ ఆగ్రహం



అపూర్వ వెంచర్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : అక్రమ లేఔట్లపై నగరపాలక కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కల్లూరు ఏరియా పరిధిలోని వసుంధర నగర్–అపూర్వ గార్డెన్స్ పక్కన ఉన్న సర్వే నెంబర్ 295/1.3.5 లలో వెలసిన అక్రమ లేఔట్‌ను కమిషనర్ పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, ప్లానింగ్ కార్యదర్శి పృథ్వీ నుంచి వివరాలు సేకరించారు. అనధికారిక లేఔట్లు వేసి ప్రజలకు విక్రయిస్తుండటంపై కమిషనర్ స్పందించారు.గతంలోనూ సదరు వెంచర్ యజమానులకు చెప్పినా స్పందన కనిపించ లేదు. దీంతో వెంచర్ యజమానులు వెంగళరెడ్డి, వెంకటరామిరెడ్డిపై పోలీసు కేసు నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనధికారిక లేఔట్లలో బిల్డింగ్ నిర్మాణాలను అనుమతులు మంజూరు జరగదనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన

గూడూరు రూరల్: కోడుమూరు నుంచి చనుగొండ్ల మీదుగా గూడూరు వరకు చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు పనులను శనివారం ఎంపీపీ సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ మార్గంలో మూడు దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సులు, ఆటోలు తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు రోడ్డు పనులకు మోక్షం లభించిందని చెప్పారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయని తెలిపారు.

క్లుప్తంగా

సూర్యనమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్):విద్యార్థి దశ నుంచే బాలలు సూర్యనమస్కారాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. శనివారం బుధవారపేటలోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో రథసప్తమిని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూర్యభగవానుని ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా ప్రతిరోజూ సూర్యనమస్కారాలు చేయాలని సూచించారు. బయటి ఆహారానికి దూరంగా ఉండి, ఇంట్లో వండిన ఆహారం తీసుకోవాలని, అప్పుడు ఎలాంటి అనారోగ్యాలు తలెత్తవని చెప్పారు. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లకు దూరంగా సంప్రదాయంగా వండే ఆహార పదార్థాలు తినాలని విద్యార్థులకు సూచించారు.

యువకులు రక్తదానానికి ముందుకు రావాలి

కర్నూలు(హాస్పిటల్): యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డేనియల్ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుమన్ చెప్పారు. శనివారం నగరంలోని రిలియన్స్ నిప్పాన్ ఇన్సూరెన్స్ కంపెనీ కార్యాలయంలో కామినేని హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించి వారికి డాక్టర్ ప్రేమ్‌కుమార్‌తో తగిన సూచనలు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ కవిత, రిలియన్స్ మేనేజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాటాలకు ముద్రలు లేకపోతే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): వ్యాపార దుకాణాల్లో వినియోగిస్తున్న కాటాలకు ఏడాదికోసారి ప్రభుత్వ ముద్రలు వేయించుకోకపోతే చట్టపర చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం నగరంలోని కృష్ణానగర్, జొహరాపురం ,వెంకటరమణకాలనీ,సంతోష్‌నగర్‌లలో వివిధ వ్యాపార దుకాణాల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేసి ముద్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 30 దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలను సరిచూసి ముద్రలు వేశామన్నారు. ఎవరైనా కాటాలకు ముద్ర వేయించుకోకపోతే వెంటనే వేయించుకోవాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు నిర్వహించారు. అవధూత దత్త పీఠాధిపతి సద్గురు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ శిష్యులు నాద ప్రసార వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలతో వ్రతాలు జరిగాయి. మంగళ హారతి, మంత్ర పుష్పం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అందం ఆత్మవిశ్వాసానికి ప్రతీక



బ్యూటీషియన్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుకా

కర్నూలు(టౌన్): అందం ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుకా అన్నారు. ఆత్మవిశ్వాసం పెరగడం వల్లే పురుషులతో మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడి రాణిస్తున్నారన్నారు.స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని అనూస్ బ్యూటీ పార్లర్‌లో మెప్మా, అనూస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ అందించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు, కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ, మెప్మా పీడీ నాగశివలీల, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళీ, టీఎంసీ విజయ భారతి, సుధాకర్, సీఓలు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.250 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

సింహ వాహనంపై శ్రీవారు



ప్రత్యేక అలంకారంలో శ్రీవారు



హోమంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు పంచామృత అభిషేకం, విశేష అర్చనలు, నవగ్రహ, దుర్గా, లక్ష్మి, కుబేర హోమాలు చేశారు. రాత్రి శ్రీవారు సింహ వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. హైకోర్టు జీపీ రఘువీర్ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్ రావు, గౌరవ సలహాదారులు హెచ్‌కే మనోహర్ రావు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త కల్లె వేణుగోపాల్ శర్మ, సంఘం కార్యవర్గ సభ్యులు కేవీ భాస్కర్‌రావు, రాఘవేంద్ర, ఉమేష్, శివరాం ప్రసాద్, దుర్గాప్రసాద్, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ సేవలు విస్తరించాలి



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటాద్రి

కర్నూలు (అర్బన్) : ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సేవలు మరింత విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీ, మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ (మేడ్) క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి హెచ్‌డీ ఈరన్న, జిల్లా కార్యదర్శి జయకర్, మేడ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు బి.బెన్నమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ ఇప్పటికే గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. పేద వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహకారాన్ని అందిస్తూ వారి ఉన్నతికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు.

చిన్నారులందరికీ టీకాలు వేయించాలి



చిన్నారికి సిరప్ అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం జొహరాపురం పరిధిలోని ఏపీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ సచివాలయం, యూపీహెచ్‌సీ ముజఫర్‌నగర్ పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల ఉపయోగాలను తల్లులకు తెలిపారు. బర్త్‌ప్లానింగ్‌లో భాగంగా గర్భిణులను ప్రసవం కోసం ఈడీడీ డేట్(డెలివరి)కి 45 రోజుల ముందు ఏ ఆసుపత్రికి వెళ్లాలనే ఆ గర్భవతి కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి హాస్పిటల్ గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమయ్యేటట్లు గర్భవతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తీవ్ర రక్తహీనత కలిగిన గర్భిణులను ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన గర్భిణీలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, డీపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుడిసె శివన్న

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుడిసె శివన్న, జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి దేవేంద్రను ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఓ హోటల్ సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు వీరికి నియామక పత్రాలు అందించారు. కేశన శంకరరావు మాట్లాడుతూ బీసీల సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘానికి బీసీలందరూ తోడ్పాటు అందించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అత్యధిక మంది బీసీ నేతలను చట్ట సభలకు పంపేందుకు సంఘం ముందుంటుందన్నారు. ఒక పార్టీ బీసీలకు టికెట్ కేటాయిస్తే మిగిలిన పార్టీలు కూడా ఆయా స్థానాల్లో బీసీలకే కేటాయించాలన్నారు. అప్పుడే బీసీ లు రాజ్యాధికారానికి దగ్గరవుతారన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు నాగార్జునగౌడ్, మల్లికార్జునగౌడ్, అంజి, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తులకు అన్నదానం



శివస్వాములకు అన్నదానం చేస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి

కర్నూలు కల్చరల్: స్థానిక దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శివ మాల దీక్షాధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి ప్రారంభించారు. శివపూజ, భజన అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శివ గురువు బొమ్మన రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు హనుమంతరెడ్డి, ఎల్లారెడ్డి, డాక్టర్ వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ టీంలను త్వరగా ఏర్పాటు చేయండి

- పెండింగ్‌లో ఫారాలకు పరిష్కారాలు చూపండి
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయండి
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల నిర్వహణకు సంబంధించి టీంలను సోమవారంలోపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారాలు 6,8 లను మూడురోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. తరువాత వచ్చే దరఖాస్తులను ఏరోజుకారోజే పరిష్కరించేలా చూడాలన్నారు. ఫారం –7కు సంబంధించి మార్పులు, చేర్పులు 0.1 శాతం దాటితే సీఈఓ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. పేదల ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జర్నలిస్టులకు హౌసింగ్ స్కీం కింద ఇళ్ల స్థలాల పంపిణీ చేసేందుకు అర్హతలు 535 జీఓ ఆధారంగా పరిశీలన చేయాలని, ఆరు దశల ప్రక్రియను చూడకూడదని డివిజినల్ అధికారులు, తహసీల్దార్లను ఆదేశించారు. 5 ఎకరాల పొలం ఉందా, కారు ఉందా, విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటాయా అన్న అంశాలను పరిశీలించాల్సిన అవసరం లేదన్నారు. గతంలో ఇంటిస్థలం ఇచ్చారా అనే అంశాన్ని మాత్రమే పరిశీలన చేయాలన్నారు. అనర్హులను సోమవారం పిలిపించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్యను ఆదేశించారు. అలాగే ఇళ్ల స్థలాలకు కావాల్సిన భూమిని గుర్తించి ఫైనల్ చేయాలని ఆమె రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీలకు వైఎస్ఆర్‌సీపీ అండ




సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని, వైఎస్ విమలరెడ్డిని కలిసిన పాస్టర్లు, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్

కల్లూరు: రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, కోడుమూరు సమన్వయ కర్త ఆదిమూలపు సతీష్ అన్నారు. శనివారం నగర శివారులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్‌లో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన సేవకుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా పేదల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పేద పాస్టర్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. అంతకు ముందు క్రైస్తవ పాస్టర్లతో నిర్వహించిన ఆత్మీయ సదస్సులో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ వైఎస్ విమలరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. సహోదర ప్రేమ, (ఇతరుల) పరులపట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, క్రిస్టియన్ మైనార్టీ సలహాదారు మద్దు బాలస్వామి, నగర క్రైస్తవులు జీజే సుకుమార్, జాన్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విమలరెడ్డిని కలిసిన పాస్టర్లు

పాస్టర్ల ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ వైఎస్ విమలరెడ్డి శనివారం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్వగృహానికి విచ్చేశారు. ఆమె ఎమ్మెల్యేకు ఆశీర్వద ప్రార్థన చేశారు. నగర పాస్టర్లు, క్రైస్తవులు ఆమెను కలిశారు.

టీజీకి సంసద్ మహారత్న అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న టీజీ వెంకటేష్, చిత్రంలో ఎంపీ విజయసాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ 14వ సంసద్ మహారత్న అవార్డు అందుకున్నారు. ఈయన రాజ్య సభ సభ్యుడిగా ఉన్న సమయంలో ఆరు శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రవాణా, పర్యాటకం, జాతీయ రహదారులు, పౌర విమానయానం, రైల్వే భద్రత, సాంస్కృతిక శాఖల స్టాండింగ్ కమిటీలకు అందించిన సేవలకు గుర్తింపుగా ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ సంస్థ అవార్డు ప్రకటించింది. న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో ఆ అవార్డు ప్రదానం కార్యక్రమం జరిగింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా ప్రస్తుత స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎంపీ విజయసాయిరెడ్డితో కలిసి అందుకున్నారు.

ఈ రోజు

ప్రైవేటు స్కూళ్ల టీచర్లకు శిక్షణ

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆదివారం బోధనపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ ప్రైవేటు అన్–ఎయిడెడ్‌స్కూళ్ల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు వాసు దేవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీవీ కన్వెన్షన్ సెంటర్ నందు శిక్షణ ఉంటుందన్నారు.

ఘంటసాల సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసా ల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ ఖాదర్‌బాషా, షేక్ హబీబ్ పేర్కొన్నారు.

షిరిడీ సాయికి వెండి మకర తోరణం అలంకరణ

కర్నూలు కల్చరల్:ది కర్నూలు స్పిరిచ్యువల్ సా సైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు రాఘవేంద్ర నగర్‌లోని బుద్ధా పరిమిడ్ ధ్యాన కేంద్రంలో శ్రీషిరిడీసాయిబాబాకు వెండి మకర తోరణం,సింహాసనం అలంకరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షు డు పిరమిడ్ బ్రహ్మర్షి డాక్టర్ బీవీ రెడ్డి తెలిపారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌పై శిక్షణ

కర్నూలు సిటీ: అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌పై నేటి నుంచి మూడు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద మార్కెట్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి పుణేకి చెందిన విజ్ఞాన్ ఆశ్రమం నుంచి మెంటర్స్ వస్తారన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో సంతానలేమికి చెక్

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యకర జీవనశైలితో వ్యంధత్వానికి (సంతానలేమి)చెక్ పెట్టచ్చని ఒయాసిస్ ఫెర్టిలిటి క్లినికల్ హెడ్ అండ్ ఫెర్టిలిటి స్పెషలిస్టు డాక్టర్ డి. విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఒయాసిస్ ఫెర్టిలిటి సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి. విజయలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో సంతానలేమి సమస్య అధికమైందన్నారు. ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం ద్వారా ఈ సమస్య నుంచి అధిగమించవచ్చని తెలిపారు. వివిధ కారణాలతో అందరూ సహజంగా గర్భం దాల్చలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ ఎ.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆ జేఏసీ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న డీఏలకు నిధులను కేటాయించాలన్నారు. పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని, ఉద్యోగులకు హెల్త్‌కార్డులను మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర చైర్మన్ ఎంసీ కాశన్న, నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మద్దిలేటి పాల్గొన్నారు.